క్లుప్తంగా

గ్రంథాలయంలో పుస్తక సమీక్ష



ప్రత్తిపాడు: పుస్తక పఠనంతో మేథోశక్తి పెంపొందించుకోవచ్చని ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ అరుణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక సమీక్ష నిర్వహించారు. గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. కథల పుస్తకాలతో పాటు విజ్ఞాన, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చి పదాలు, పద్యాలు వారితో చదివించారు. అనంతరం వారికి కాపీ రైటింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ తల్లిదండ్రులు గ్రంథాలయాలకు తమ పిల్లలను పంపాలని సూచించారు. విద్యా సంబంధ విషయాలతో పాటు అనేక రకాల అంశాలను పిల్లలకు నేర్పించడం జరుగుతుందని అరుణ వివరించారు.

నేడు లక్ష్మీ నరసింహ స్వామి జయంతి

తెనాలిఅర్బన్: శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జయంతి వేడుకలను తెనాలి నాజర్‌పేటలో వేంచేసిన శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకాలు, స్వామివారిని అలంకరించి మూల మంత్రంలో హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు సహస్ర నామార్చన, 22వ తేదీన స్వామివారికి 108 బిందెల పానకంతో అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృప, కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. అభిషేకాల్లో పాల్గొనే భక్తులు ముందుగా తమ గోత్రం పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు..

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు ఉన్నత చదువులు అభ్యసించాలని యువనారీ హెల్త్‌కేర్ ట్రస్టు చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. వరంగల్ హనుమకొండలో షాహీన్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఏ కోర్సు చేస్తే ఉపాధి అవకాశాలు ఉంటాయనే అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని చెప్పారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో వారు ఎంచుకునే గ్రూప్స్ పైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి పదోతరగతి వరకు చదివింది ఒక ఎత్తయితే ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదవడంపై వారి బంగారు భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి

ఫిరంగిపురం: విద్యుత్‌షాక్‌తో గొర్రెలకాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంపతి వెంకటేశ్వర్లు(65) తన వద్ద నున్న మేకలను తోలుకొని సమీపంలోని పొలాల వద్దకు మేతకు తీసుకువెళ్లాడు. కర్రకు కొడవలి కట్టి చెట్టు పైనున్న కొమ్మలు కోస్తూ ఉన్న క్రమంలో విద్యుత్ తీగలకు కొడవలి తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



తాడికొండ: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుళ్లూరు గ్రామానికి చెందిన గొడవర్తి డేవిడ్ పెద్ద కుమార్తె సుకన్య(26)కు రాయపూడి గ్రామానికి చెందిన విజయ్ బాబుకు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. తదనంతరం భార్య భర్తలు విజయవాడలో కాపురం పెట్టగా ఇటీవల కాలంలో రాయపూడిలోని భర్త ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తుళ్లూరు పుట్టింటికి వచ్చిన సుకన్య ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తుళ్ళూరు సీఐ అనురాధ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా.. గత కొంత కాలంగా అత్త, మామ, భర్త కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి 7 నెలల పాప ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనురాధ తెలిపారు.

పైరుకు అండ సేద్యపు నీటి కుంట..!

- వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ప్రయోజనం
- వినియోగించుకుంటే రైతాంగానికి మేలు
- ఉపాధి హామీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా తవ్వకం

ప్రత్తిపాడు: పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం ప్రత్తిపాడు నియోజకవర్గం. అంతేకాకుండా నాగార్జునసాగర్ ఆయకట్టు చివరన ఉన్న ప్రాంతం కూడా. అనావృష్టి వంటి వర్షాభావ పరిస్థితుల్లో సాగునీటి కోసం ఈ ప్రాంత రైతులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేసినప్పటికీ చివరి భూముల వరకు చేరుతాయన్న ఆశ కూడా ఒక్కోసారి ఉండని పరిస్థితి. మరికొన్ని సార్లు అయితే మురుగు కాల్వలకు అడ్డు కట్టలు వేసుకుని మురుగునీటితో పంట పొలాలను తడుపు కోవాల్సిన స్థితి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయం వైపు కాస్తంత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం సేద్యపు నీటి కుంటలను నిర్మిస్తుంది. ఈ కుంటలను రైతులు తమ పొలాల్లో తీసుకుంటే వర్షాభావ పరిస్థితుల నుంచి కొంత మేర గట్టెక్కవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో పంట ఎండిపోకుండా ప్రాణం పోయవచ్చు.

ఉపాధి హామీ ద్వారా ఉచితంగా..

భూగర్భ జలాలను పెంచడంతో పాటు నీటి ఎద్దడి తలెత్తిన పరిస్థితుల్లో రైతులకు ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం వారి పొలాల్లో సేద్యపు నీటి కుంటల తవ్వకానికి అవకాశం కల్పించింది. నాలుగు రకాల నిర్ణీత సైజుల్లో కుంటలను పూర్తి ఉచితంగా ఉపాధి కూలీలతో కుంటను నిర్మించనున్నారు. రైతుల అవసరాన్ని, స్థలాన్ని బట్టి మూడు సెంట్లు నుంచి 20 సెంట్లు విస్తీర్ణం వరకు కుంటను తవ్వుతారు. మూడు సెంట్ల నీటి కుంటలో సుమారుగా 2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. రైతులు కేవలం పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఉపాధి అధికారులకు అందిస్తే చాలు. పూర్తి ప్రభుత్వ ఖర్చులతో కుంటను తవ్వించి, ఉపాధి హామీ పథకం అధికారులు రైతుకు అప్పగిస్తారు.



ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలో ఉపాధిహామీ పథకం ద్వారా రైతు పొలంలో తీసిన సేద్యపు నీటి కుంట



ప్రత్తిపాడు పంచాయతీలో నీటికుంటను తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

సేద్యపు నీటి కుంట సైజు	ఖర్చు
5–5	రూ. 24,000
10–10	రూ. 70,000
15–15	రూ. 1,40,000
20–20	రూ. 2,35,000

ఎన్నో ఉపయోగాలు..

- పంటపొలంలో సేద్యపు నీటికుంట ఉంటే రైతుకు బహుళ ప్రయోజనాలున్నాయి.
- వర్షాకాలంలో రైతులు పొలంపై నుంచి పారే నీటిని కుంటల్లో నింపుకోవచ్చు.
- నీటి ఎద్దడి ఉన్న సమయంలో ఆ నీటితో పంటను తడుపుకోవచ్చు.
- వేసవిలో రైతులు, కూలీలకు తాగునీటి అవసరాలను తీరుస్తుంది.
- పశువులు, గొర్రెలు, ఆవులు, ఇతరత్రా మూగ జీవాలకు దాహార్తిని తీర్చవచ్చు.
- బావులు, భూగర్భ జలాలు వృద్ధి అయ్యే అవకాశం పుష్కలంగా ఉంది.
- కుంటల కోసం తవ్విన మట్టిని పొలం గట్లకు, భూమి చదునుకు వినియోగించుకోవచ్చు.
- సేద్యపు నీటి కుంట తవ్వకానికి సంబంధించిన పూర్తి నిధులను ప్రభుత్వం చెల్లిస్తుంది.

ప్రతి మండలంలో కుంటలు తీసేలా..

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సేద్యపు నీటి కుంటలు తీసేందుకు ఉపాధి హామీ అధికారులు పనులు ప్రారంభించారు. ప్రత్తిపాడు మండలంలో 27 కుంటలను గుర్తించగా, వాటిలో 17 కుంటలు మంజూరయ్యాయి. ఇప్పటికే ఐదు కుంటల పనులు మొదలవ్వగా, మరో పన్నెండు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. కాగా మరో పది కుంటలకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి పరిపాలనా అనుమతులు రావలసి ఉంది. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఐదు నుంచి పది కుంటలను గుర్తించి మంజూరు కోసం జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. వాటిలో కొన్ని కుంటలు మంజూరు కాగా, మరికొన్నింటికి ఎన్నికల కోడ్ వలన అనుమతులు రాలేదు.

ఇదే అనువైన సమయం

రైతులు తమ పొలాల్లో సేద్యపు నీటి కుంటలను తీయించుకునేందుకు ఇదే అనువైన సమయం. ప్రస్తుతం పొలాల్లో పంటలు లేకపోవడం, మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కుంట నిర్మాణ పనులను ఇప్పుడు ప్రారంభించుకుంటే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కుంట తీసే సమయంలో వచ్చే మట్టిని తమ పొలంలోని గట్లతో పాటు పల్లంలో ఉన్న భూమిని మెరక చేసుకుని చదును చేసుకునే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా పంట నష్టపోవాల్సిన అవసరం కూడా ఉండదు. రైతులు ఒక్కసారి ఈ దిశగా ఆలోచిస్తే ఎంతోకొంత వర్షాభావ పరిస్థితుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం

– హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



గుంటూరు రూరల్: రైతులు పండించిన పంటలకు విలువల జోడింపుతో మంచి ఆదాయం పొందవచ్చని హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో నిర్వహించిన రైతు శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగుకు విలువలను జోడించి మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. హార్టికల్చర్ డిప్యూటి డైరెక్టర్ వీఎస్ ధర్మజ, వీఏఎస్ డాక్టర్ రాంబాబు, సేంద్రియ రైతులు ఏడుకొండలు, శబరినాథ్, శివనాగమల్లేశ్వరరావు, జ్యోతి, చలపతిరావు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'హ్యూమన్ రైట్స్' సభ్యత్వం అందుకున్న సురేష్

భట్టిప్రోలు: మండలంలోని పెసర్లంకకు చెందిన యన్నం సురేష్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ పీపుల్స్ సభ్యత్వం పొందారు. సోమవారం రేపల్లెలోని కార్యాలయంలో నేషనల్ కో–ఆర్డినేటర్ పి. సాంబశివరావు చేతుల మీదగా సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ నిర్వాహకులు ఎ.నరసింహారావు, డి. నాగేశ్వరరావు, కె.సుమత్, పి.ప్రభాకర్, సీహెచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘననివాళి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొండా శివరామిరెడ్డి, సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ఎక్కడ ప్రమాదం ఉందో అక్కడ ప్రకాశం.. ఎక్కడ ప్రజలు ఉంటే అక్కడ ప్రకాశం అనేలా సమాజాభ్యుదయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహామనిషి టంగుటూరి ప్రకాశం పంతులు అని విద్యావేత్త ఇనుపులపాటి చంద్రయ్య అన్నారు.

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి మనోఫలకం పై చిరస్మరణీయంగా నిలిచిన ఉద్దండమూర్తి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. విశ్రాంత అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ అత్యంత నమ్మకంతో తన నిజమైన వారసుడిగా ప్రకాశం పంతులును గుర్తించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు నివాళులర్పించారు.

నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య..

లక్ష్మీపురం: ప్రజా క్షేమమే పరమావధిగా ఉద్యమమే ఊపిరిగా ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం గడిపిన నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సోమవారం అవగాహన సంస్థ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ సీనియర్ సభ్యులు సదాశివం, బసవ గుప్త, మల్లేశ్వరరావు, జనార్దన్ రావులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు కొల్లి నాగేశ్వరరావు



కొల్లి నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: ప్రముఖ రైతు ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సీపీఐ నాయకులు అమరజీవి కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం జరిగింది. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైతు సంఘ సీనియర్ నాయకుడు పాపారావు మాట్లాడుతూ పత్తి రైతుల కోసం సుప్రీంకోర్టు దాకా వెళ్లి పోరాడిన ఘనత కొల్లి నాగేశ్వరరావుకు దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘం నాయకులు పుప్పాల సత్యనారాయణ, విఠల్ రెడ్డి, శివశంకరరావు, పి.జగన్నాథం, చిన్న, కాయల రామారావు, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మీమాంస దేనికీ..



శిథిలావస్థకు చేరిన మాంసం మార్కెట్

- శిథిలావస్థలో మాంసం మార్కెట్ భవనం
- రూ.లక్షల ఆదాయం సమకూరుతున్నా మున్సిపాలిటీ నిర్లక్ష్యం
- స్లాబు పెచ్చులూడుతూ వ్యాపారానికి ఆటంకం
- విరిగిన గేట్లతో రక్షణ కరువు, నీరు రాక కొళాయిలు వెలవెల
- సమస్యలు పరిష్కరించాలంటున్న దుకాణదారులు



ప్రధాన ద్వారంలోని విరిగిన గేట్లు

పొన్నూరు: నిడుబ్రోలులోని పురపాలక సంఘ మాంసం మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో పలు సమస్యలతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిష్కరించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. పురపాలక సంఘ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాల క్రితం మార్కెట్ నిర్మితమైంది. 12 దుకాణాల్లో ప్రస్తుతం మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఏటా రూ.30 లక్షల వరకు దుకాణాల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. అయితే ఏళ్ల గడిచినా దుకాణ సముదాయం తాత్కాలిక మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. ప్రధాన ద్వారంలో ఐరన్ గేట్లు విరిగిపోవడంతో మార్కెట్‌కు రక్షణ కరువైంది. మార్కెట్‌లోని దుకాణాల్లో నీటి కొళాయిలు వినియోగానికి నోచుకోవడం లేదు. భవనం స్లాబు పెచ్చులూడి పడుతోంది. దీంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మార్కెట్ ద్వారంలోని గేట్లకు మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాపారం సరిగా చేయలేకపోతున్నా..



మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో వ్యాపార నిర్వహించలేకపోతున్నాం. ద్వారంలోని ఐరన్ గేట్ లు పూర్తిస్థాయిలో విరిగిపోయాయి. దుకాణాలలో తాగు నీటి కొళాయిలు పనిచేయడం లేదు. స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నాను.

– షేక్ గఫార్, లీజుదారుడు

25న 'ఆహ్వానం' లక్ష్మి సంస్మరణ

తెనాలి: ఆహ్వానం మాసపత్రిక సంపాదకురాలు ఎస్ఎస్ లక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనె 25న తెనాలిలో సంస్మరణసభను నిర్వహించనున్నారు. ఆహ్వానం లక్ష్మిగా సాహితీ లోకంలో గుర్తింపును పొందిన ఆమె గతేడాది మృతి చెందారు. ఆమెకు నివాళిగా పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఏడాదిపాటు ప్రతినెల ఒక మంచి పుస్తకంపై చర్చ నిర్వహించిన విషయం తెలిసిందే. చర్చలు ముగిసిన సందర్భంగా 25వ తేదీన ప్రథమ వర్ధంతి సంస్మరణను ఏర్పాటు చేశారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే సభకు జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయితలు / కవులు వాడ్రేవు వీరలక్ష్మీదేవి, పాపినేని శివశంకర్, కాట్రగడ్డ దయానంద్, బండ్ల మాధవరావు, సమయం రాజా సంజీవదేవ్ పాల్గొంటారు.

ప్రారంభమైన ఆత్మ సంయమయోగః ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత – ఆత్మసంయమయోగః ధారావాహిక ప్రవచన కార్యక్రమాలు మొదలయ్యాయి. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో సువీరానందస్వామి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 వరకు నిర్వహించనున్నారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సువీరానందస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో సన్యాసమని పిలిచినది యోగమని తెలుసుకోవాలని అన్నారు. సంకల్ప త్యాగం చేయని వారు యోగి కాలేరని పేర్కొన్నారు.

ఉండవల్లి సెంటర్‌లో వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో ఓ వ్యక్తి మృతిచెందడంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్ కాలనీ (యానాదుల కాలనీ)కి చెందిన బొజ్జా కృష్ణయ్య (26) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆదివారం సాయంత్రం ఉండవల్లి సెంటర్‌లో మృతి చెందడంతో భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సత్రం స్థలం అన్యాక్రాంతమైతే ఊరుకోం

బాపట్లటౌన్: తూర్పు సత్రం స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే చూస్తూ ఉరుకోబోమని కాపు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తూర్పు సత్రం స్థలం విషయంపై దేవాదాయ శాఖ ఈవోకు వినతిపత్రం అందజేశారు. కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం, పుర ప్రజల సౌకర్యార్థం పేరం గురుడాచలం నాయుడు దానం చేసిన భూమిని ఏవో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేవిధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా తూర్పుసత్రంలో కొలతలు తీయడం హేయమైన చర్య అన్నారు. సమాచార హక్కు చట్టం వర్తించని దేవాదాయ శాఖకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎందుకు వర్తించదన్నారు. ఐటీసీఎల్ కంపెనీకు తూర్పుసత్రం స్థలాన్ని కట్టబెడితే కాపు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడం ఖాయమన్నారు. ఈ స్థలాన్ని కేవలం పట్టణంలోని ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈవోకు వినతిపత్రం అందించిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ జిట్టా ప్రమీలారాణి, జనసేన నాయకురాలు తులసీకుమారి, కాపు సంఘం నాయకులు పర్వతరెడ్డి భాస్కరరావు, అడ్వకేట్ విన్నకోట సత్యప్రసాద్, కొట్రా కొండలు, తులసీసాయిదాస్, లేళ్ళ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

ఫలితాల రోజు 144 సెక్షన్ అమలు

ఎస్ఐ వి. సోమేశ్వరరావు



పాతమల్లాయపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సోమేశ్వరరావు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): ఎన్నికల ఫలితాల రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామమైన పాతమల్లాయపాలెంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఏ ఒక్కరు వ్యవహరించినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే గ్రామంలో గతంలో వివాదాలు, కొట్లాటలు, అల్లర్లలో ప్రమేయమున్న కొందరు వ్యక్తులను బైండోవర్ చేశామని, మరికొందరిని త్వరలో బైండోవర్ చేయనున్నామని చెప్పారు. ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినప్పటికీ ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించడం ద్వారా గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. ఇరుపార్టీల నాయకులు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఎన్నికల కేసుల్లో పేర్లు నమోదైతే జీవితాంతం వెంటాడుతాయని హెచ్చరించారు.

పట్టాలపైకి పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రామీణ ప్రాంతవాసులకు అవగాహన కల్పించిన ఆర్పీఎఫ్ పోలీసులు



పశువుల కాపరులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణదాసు

లక్ష్మీపురం: రైలు పట్టాలపై మూగ జీవాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే మూగ జీవాలతో పాటు రైలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణ దాసు తెలిపారు.

గుంటూరు డివిజన్ పరిధిలోని పెదకూరపాడు పరిసర ప్రాంతాలలో తాను.. రెడ్డిపాలెం, సిరిపురం పరిసర ప్రాంతాలలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు పశువుల కాపురులకు గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ సీఐ ఆర్.వీరబాబు ఆదేశాల మేరకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ పశువులను, మూగ జీవాలను రైలు పట్టాలపై రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. రైలు పట్టాలపై మూగ జీవాలను నిర్లక్ష్యంగా వదిలేస్తే, దాని వల్ల కలిగే ప్రమాదాలకు రైలు రాకపోకల ఇబ్బందులకు పశువుల యజమానులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పశువుల కాపురులకు పలుమార్లు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పోలీసుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల పెదకూరపాడు, బండారుపల్లి, సిరిపురం ప్రాంతాల్లోని రైలు పట్టాలపై పశువుల పడి మృతి చెందడం జరిగిందన్నారు. ఈ ప్రమాదం జరగడం ద్వారా రెండు రైళ్ల రాకపోకలు నిలిచి పోవడం జరిగిందన్నారు. పశువులను రైలు పట్టాలపై వదిలిన యజమానులైన ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు.

ఎనిమిది నెలల పసికందుకు అరుదైన చికిత్స



డాక్టర్ ఆళ్ల సిద్దార్థరెడ్డి

గుంటూరు మెడికల్: పుట్టుకతోనే కంజినేటల్ ఈజోఫాజల్ వెబ్ సమస్యతో బాధపడుతున్న ఎనిమిది నెలల పసికందుకు అరుదైన చికిత్స చేసినట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి చెప్పారు. సోమవారం గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా నగరం మండలం చిన మట్లపూడి గ్రామానికి చెందిన ఎం.శ్రావణి, విజయకుమార్‌లకు ఎనిమిది నెలల క్రితం బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు అన్నవాహిక ప్రారంభదశలో గొంతులోపల పొర ఏర్పడి తల్లి నుంచి తాగే పాలు పొట్టలోకి వెళ్లకుండా ముక్కు ద్వారా బయటకు వచ్చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించినా సమస్య నిర్ధారణ జరగక ఈనెల 16న తమ హాస్పటల్‌కు వచ్చారని డాక్టర్ సిద్ధార్థరెడ్డి చెప్పారు. పరీక్షలు చేసి పసికందు కంజినేటల్ ఈసోఫాజల్ వెబ్ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి సమస్య 50వేల జననాల్లో ఒకరికి వస్తుందన్నారు. అన్నవాహిక ప్రారంభదశలో గొంతుకు అడ్డుగా ఉన్న పొరను ఎలాంటి ఆపరేషన్ చేయకుండా ఈనెల 17న ఎండోస్కోపి ద్వారా ఎస్‌జీ డైలటేషన్ చేసి కేవలం 15 నిమిషాల వ్యవధిలో తొలగించామన్నారు.